క్లుప్తంగా

నారాయణస్వామిని విమర్శిస్తే ఊరుకోం

వెదురుకుప్పం: ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామిని విమర్శిస్తే ఊరుకునేది లేదని జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ అన్నారు. సోమవారం వెదురుకుప్పంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న మంత్రిపై కొందరు పనిగట్టుకుని అవినీతి ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి వెనుక అన్ని వర్గాల ప్రజలు ఉన్నారని చెప్పారు. ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య మాట్లాడుతూ గంగాధరనెల్లూరు నియోజకవర్గం డిప్యూటీ సీఎం సారథ్యంలో ప్రగతి పథంలో దూసుకుపోతోందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజి, బొమ్మయ్యపల్లె సర్పంచ్ గోవిందయ్య పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

పుత్తూరు రూరల్: పుస్తక పఠనంతో సంపూర్ణ విజ్ఞానం కలుగుతుందని స్థానిక గ్రంథాలయాధికారి మీనాకుమారి తెలిపారు. ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం గ్రంథాలయంలో పాఠకులకు పుస్తకాల గొప్పతనం గురించి వివరించారు. పుస్తక పఠనంతో ప్రపంచాన్ని మార్చ గల శక్తి కలుగుతుందన్నారు. విజ్ఞానం, వినోదం, జ్ఞాపకశక్తి విద్యార్థుల్లో పెరగాలంటే పుస్తక పఠనం చేయించాలని చెప్పారు. ఆ దిశగా తల్లిదండ్రులు పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం ప్రాధాన్యతను గుర్తించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

పుత్తూరు రూరల్: పుత్తూరు మండలం తడుకు గ్రామం వద్ద సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. తడుకు పంచాయతీ చంద్రప్పనాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన రాంబాబు(40), మురళి(15), ప్రసాద్(5) పుత్తూరుకు వచ్చి తిరుగు ప్రయాణంలో తడుకు వద్ద రోడ్డు దాటుతున్నారు. అదే సమయంలో తిరుపతి నుంచి పుత్తూరు వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వారు గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. గాయపడిన వారు ఒకే కుటుంబానికి చెందిన సమీప బంధువులు కావడం గమనార్హం. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ స్కూళ్లలోనే ఉన్నత విద్య



ప్రభుత్వ స్కూల్‌లో తమ పిల్లలను చేర్పిస్తున్నట్లు దరఖాస్తు అందిస్తున్న తల్లిదండ్రులు

పాలసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఉన్నత విద్య అందిస్తామని బలిజకండ్రిగ హైస్కూల్ హెచ్‌ఎం మనోహర్ నాయుడు తెలిపారు. సోమవారం శ్రీకావేరిరాజుపురం, కృష్ణజమ్మపురం, చెరువుముందర కండ్రిగ స్కూల్ ఉపాధ్యాయులతో కలిసి ప్రైవేటు పాఠశాలలకు పిల్లలను పంపుతున్న తల్లిదండ్రులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలతో పాటు నోటుపుస్తకాలు, రెండు జతల యూనిఫాం, బూట్లు, టై అందిస్తోందన్నారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలపై కరపత్రాలు అందించారు. వచ్చే ఏడాదికి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించే తల్లిదండ్రుల నుంచి దరఖాస్తులను తీసుకున్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

పుత్తూరు రూరల్: కౌన్సిలర్లు వార్డుల్లో పర్యటిస్తూ ప్రజల అవసరాలను గుర్తించి వాటిని పరిష్కరించాలని పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత కుమారస్వామిరెడ్డి సూచించారు. సోమవారం మున్సిపాలిటీ 5వ వార్డుకు చెందిన తాయిమాంబాపురం, గంగమాంబాపురం, చౌటూరు, బండారుపల్లి, పిళ్లారిపట్టు, ఆంజనేయపురం, గణపతినగర్‌లో ఆయన పర్యటించారు. తాయిమాంబాపురం చెరువు వద్ద కల్వర్టు ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి, నాయకులు జయరామిరెడ్డి, వెంకటముని మేస్త్రీ, శివలింగం తదితరులు ఉన్నారు.

కొండమల్లీశ్వరుడికి ప్రత్యేక పూజలు



వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.

పంచాయతీలే దేశానికి పట్టుకొమ్మలు





జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకుంటున్న పెద్దకాల్వ సర్పంచ్ ఏకాంబరం, నింద్ర సర్పంచ్ వసంతబాబురెడ్డి

- అట్టహాసంగా పంచాయతీరాజ్ డే
- ఉత్తమ పంచాయతీల సర్పంచులకు అవార్డుల అందజేత

నగరి: గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ భార్గవి అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని సోమవారం వెలుగు కార్యాలయంలో ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖకు 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. 1959లో గ్రామ, బ్లాక్, జిల్లా స్థాయిల పంచాయతీరాజ్ మూడంచెల వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందని, 1997లో రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం కావాలనే ఉద్దేశంతో 73, 74 రాజ్యాంగ సవరణ జరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులతో గ్రామాలను అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ సందర్భంగా తమ పనితీరుతో సర్పంచ్‌లలో ముందు వరుసలో నిలిచిన వేలావడి సర్పంచ్ చంద్రకళ, మూలనత్తం సర్పంచ్ ఆదెమ్మ, మిట్టపాళెం సర్పంచ్ పీతాంబరం, అడవికొత్తూరు సర్పంచ్ రోశమ్మకు మండలస్థాయి ఉత్తమ సర్పంచ్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శేషగిరిరావు, వైస్ ఎంపీపీ కన్నియప్ప, కోఆప్షన్ సభ్యులు దస్తగిరి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కార్వేటినగరం: పంచాయతీలే దేశానికి పట్టుకొమ్మలని ఎంపీపీ లత అన్నారు. సోమవారం మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో జాతీయ పంచాయతీ దినోత్సవాన్ని సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ప్రతి పంచాయతీ ఉత్తమ పంచాయతీగా జిల్లాస్థాయిలో అవార్డులను అందుకోవాలని సూచించారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లను శాలువలతో సన్మానించి ప్రశంసాపత్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, ఎంపీడీఓ మోహన్‌మురళి, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, పంచాయతీ ఈఓ మణి, హేమకుమార్, ఎంపీటీసీ వెంకటేష్, మురగయ్య, శేషాద్రి, సచివాలయ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

అలాగే మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాల్లో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

ఉత్తమ సర్పంచ్‌గా ఏకాంబరం

గంగాధరనెల్లూరు: మండలంలోని పెద్దకాల్వ సర్పంచ్ ఏకాంబరం జిల్లాస్థాయిలో ఉత్తమ సర్పంచ్‌గా ఎంపికయ్యారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్, జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు చేతుల మీదుగా ఏకాంబరం ఉత్తమ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈసందర్భంగా ఏకాంబరం మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధిని గుర్తించినందుకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలని ఎంపీపీ నాగరాణి అన్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అనంతరం సర్పంచ్‌లకు ప్రశంసాపత్రాలను అందజేశారు. సమావేశంలో జెడ్పీటీసీ సుకుమార్, ఎంపీడీఓ సుధాకరరావు, ఈఓపీఆర్డీ పురుషోత్తం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నింద్రకు జిల్లాస్థాయి అవార్డు

నింద్ర: మండల కేంద్రం నింద్ర పంచాయితీకి జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయితీ అవార్డు పురస్కారం దక్కింది. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్తూరు జెడ్పీ హాలులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ వసంతబాబురెడ్డి సోమవారం కలెక్టర్ సగలి షణ్మోహన్, జిల్లా పరిషత్ చెర్మన్ శ్రీనివాసులు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.



ఉత్తమ సర్పంచ్‌కు అవార్డు అందజేస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

ఈ సందర్భంగా సర్పంచ్ వసంతబాబురెడ్డి మాట్లాడుతూ ఉత్తమ పంచాయితీ అవార్డు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. స్థానిక పార్టీ నాయకులు సర్పంచ్ వసంతబాబు రెడ్డిని అభినందించారు.

గ్రామ సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం

గంగాధరనెల్లూరు: గ్రామ సచివాలయాలతో గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాధ్యమైందని ఎంపీపీ అనితారెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ హాలులో సోమవారం జాతీయ పంచాయతీరాజ్ ఏర్పాటు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీప్రియ, ఎంపీడీఓ శ్రీదేవి మాట్లాడుతూ ఉత్తమ సర్పంచులుగా ఎంపికైన వారిని సన్మానించారు. వైస్ఎంపీపీ హరిబాబు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఉత్తమ పంచాయతీగా డీఎం పురం

కార్వేటినగరం: జిల్లాస్థాయి ఉత్తమ పంచాయతీగా డీఎంపురం ఎంపికైనట్లు మాజీ ఏఎంసీ చైర్మన్ కృష్ణయాదవ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు చేతుల మీదుగా డీఎంపురం సర్పంచ్ తులసి జిల్లాస్థాయి ఉత్తమ పంచాయతీ అవార్డును అందుకున్నారని తెలిపారు. అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు డీఎంపురం పంచాయతీని ఆదర్శంగా తీసుకుని గ్రామాలను అభివృద్ధి చేయాలని సూచించారు.



ఉత్తమ వలంటీర్లకు ప్రశంసాపత్రాలను అందుకుంటున్న వలంటీర్లు



జీడీనెల్లూరు సర్పంచ్ సుబ్రమణ్యంయాదవ్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ అనితారెడ్డి



వెదురుకుప్పం: సర్పంచ్ గోవిందయ్యకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎంపీడీఓ సుధాకరరావు



జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు చేతులఅవార్డును అందుకుంటున్న సర్పంచ్ తులసి

బాధితులకు పరామర్శ



బాధితులకు బియ్యం అందజేస్తున్న సర్పంచ్ భారతి

వెదురుకుప్పం: గాలివాన బీభత్సానికి ఇళ్లు కోల్పోయిన బాధితులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ అన్నారు. మండలంలోని మొరవ గ్రామంలో గాలివానకు వెంకటాద్రి, సుందరమ్మకు చెందిన ఇళ్లు ధ్వంసమయ్యాయి. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీతో పాటు అధికారులు సోమవారం మొరవ గ్రామంలో పర్యటించి బాధితులను పరామర్శించారు. బాధితులకు బియ్యం పంపిణీ చేశారు. అధికారులతో మాట్లాడి ఆర్థికసాయం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వం కొత్తగా పక్కా ఇళ్లు మంజూరు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు భారతి, గోవిందయ్య, వీఆర్ఓ బాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు శివాజి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, నాయకులు విజయశేఖర్‌రెడ్డి, రమణ, కేశవులు పాల్గొన్నారు.

పోషకాహారంతో మెరుగైన ఆరోగ్యం



వంటకాలను పరిశీలిస్తున్న ఎంపీపీ నాగరాణి

వెదురుకుప్పం: ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవడం ద్వారా మెరుగైన ఆరోగ్యం పొందవచ్చని ఎంపీపీ నాగరాణి అన్నారు. సోమవారం వెదురుకుప్పం వెలుగు కార్యాలయంలో చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాల ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలను నిత్యం తీసుకుంటే అనారోగ్య సమస్యలు రావని తెలిపారు. ప్రతి ఒక్కరూ పోషకాహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆమె ప్రదర్శనలో ఉంచిన పోషక పదార్థాలను పరిశీలించి రుచి చూశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, తహసీల్దార్ పుల్లారెడ్డి, ఎంపీడీఓ సుధాకరరావు, మాజీ వైస్ ఎంపీపీ సుబ్రమణ్యం, ఏపీఓ ఇందు, వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

చేతికొచ్చిన పంటలన్నీ వర్షార్పణం



నీట మునిగిన రెడ్ బనానా



ధ్వంసమైన చేపల కొలను

- నీట మునిగిన థాయిలాండ్ నిమ్మ, రెడ్ బనానా
- పుత్తూరు మండలానికి చెందిన యువరైతు మనోజ్‌కు రూ.లక్షల్లో నష్టం

పుత్తూరు రూరల్: గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పుత్తూరు మండలం చెర్లోపల్లికి చెందిన మనోజ్ అనే రైతుకు లక్షల రూపాయల నష్టం వాటిల్లింది. యువ రైతు మనోజ్ థాయిలాండ్ సీడ్‌లెస్ నిమ్మ రకాన్ని రెండున్నర ఎకరాలు, రెడ్ బనానాను ఒక ఎకరాలో, బ్లూబెర్రీ ఒక ఎకరాలో, బొప్పాయి రెండున్నర ఎకరాలు, సొరకాయ రెండున్నర ఎకరాల్లో సాగు చేశారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పంటల సాగు చేపట్టాడు. అయితే అకాల వర్షానికి ఈ పంటలన్నీ పూర్తిగా నీట మునిగాయి. డ్రిప్ పరికరాలు సైతం దెబ్బతిన్నాయి. మరో మూడు నెలలు గడిచి ఉంటే అన్ని పంటలు చేతికందేవని, అయితే అకాల వర్షం కారణంగా నష్టం వాటిల్లినట్లు రైతు మనోజ్ తెలిపాడు. అన్ని పంటల సాగుకు సుమారు రూ.9 లక్షలకు పైగా ఖర్చు చేశానన్నాడు. అలాగే రూ.11 లక్షల వ్యయంతో 79 సెంట్ల విస్తీర్ణంలో చేపల పెంపకం చేపట్టానని, అందులో 29 సెంట్ల మేర పాన్‌లైనర్ సిస్టమ్ (ఆక్సిజన్ ఇన్‌టేక్) విధానంతో 2వేల చేపల పెంపకాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈదురు గాలులకు గ్యాస్ పైపులు పగిలిపోవడంతో పాటు టార్పాలిన్ పట్టలు ఎగిరిపోయి 400 గ్రాముల నుంచి 1 కేజీ బరువు కలిగిన 2 వేల చేప పిల్లలు చనిపోయాయని ఆవేదన వ్యక్తం చేశాడు. చేపల కొలను ద్వారా రూ.2 లక్షలు, పంటల ద్వారా మరో రూ.9 లక్షలు నష్టం వాటిల్లిందని, అధికారులు పంట నష్టాన్ని పరిశీలించి ఆదుకోవాలని కోరాడు.

నేడు ఉప ముఖ్యమంత్రి పర్యటన

వెదురుకుప్పం: ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి మంగళవారం మండలంలోని నల్లవెంగనపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని అగ్గిచేనుపల్లె పంచాయతీలో పర్యటించనున్నట్లు ఎంపీడీఓ సుధాకరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధితో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారని చెప్పారు. మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలని కోరారు.

శాప్ డైరెక్టర్‌గా యాదవేంద్రరెడ్డి నియామకం



వడమాలపేట: ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ (శాప్) డైరెక్టర్‌గా వడమాలపేట మండలం పూడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎ.యాదవేంద్రరెడ్డిని నియమించినట్లు తెలిపారు. ఈయన రెండేళ్ల పాటు పదవిలో కొనసాగుతారని ఉత్వర్వుల్లో పేర్కొన్నారు. ఈ పదవిలో నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి, పర్యాటకశాఖ మంత్రి రోజాకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ సరఫరాపై వినతి

పాలసముద్రం: వ్యవసాయానికి ఇస్తున్న తొమ్మిది గంటల విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శివప్రకాష్ రాజు కోరారు. సోమవారం ఆయన రాచపాళెం సబ్‌స్టేషన్ విద్యుత్ శాఖ ఏఈ వరదరాజుతో కలిసి సిబ్బందిని కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా శివప్రకాష్ రాజు మాట్లాడుతూ వేసవిలో పంటలు దెబ్బతినకుండా రైతులకు విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయాలని తెలిపారు. ముఖ్యంగా జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో లైన్‌మెన్ షికామణి, షిఫ్ట్ ఆపరేటర్లు, వైస్ సర్పంచ్ సుమన్, ప్రకాష్ పాల్గొన్నారు.

మేనకోడలి సీమంతంలో మంత్రి ఆర్‌కే రోజా



సీమంతం నిర్వహిస్తున్న మంత్రి ఆర్కేరోజా

నగరి : తమిళనాడులోని పుట్లూరు అమ్మన్ ఆలయంలో తన మేనకోడలి సీమంతం కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహించి మంత్రి ఆర్కే రోజా మొక్కు తీర్చుకున్నారు. పిల్లలు లేని వారు తమిళనాడులోని పుట్లూరు అమ్మవారి ఆలయంలో వేడుకుంటే తప్పకుండా పిల్లలు పుడతారని భక్తుల నమ్మకం. అలా మొక్కుకున్న భక్తులు గర్భం దాల్చిన తర్వాత అమ్మవారి సమక్షంలో 'సీమంతం' చేసుకోవడం పరిపాటి. ఈ నేపథ్యంలో మంత్రి ఆర్‌కే రోజా తన మేనకోడలు గర్భం దాల్చాలని ఆలయంలో మొక్కుకున్నారు. ప్రస్తుతం ఆమె గర్భిణి కావడంతో అమ్మవారి ఆలయంలో మేనకోడలికి సీమంతం చేసి మొక్కు తీర్చుకున్నారు. సంతానప్రాప్తి కలిగించే ఆలయంగా పేరు పొందిన పుట్లూరు అమ్మవారి ఆలయానికి మంత్రి సీమంత వేడుకలకు విచ్చేయడం సంతోషదాయకమని ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. మంత్రిని ఆలయ మర్యాదలతో ఆహ్వానించి సీమంతం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వనరుల పంపిణీకే పంచాయతీ రాజ్ వ్యవస్థ



మహాత్మ గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎంపీడీఓ, ఎంపీపీ



అవార్డు అందుకుంటున్న సర్పంచ్ గాలి మహేష్ బాబు

పుత్తూరు రూరల్: గ్రామీణ ప్రజల దైనందిన అవసరాలకు అనుగుణంగా వనరుల పంపిణీకే పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పడిందని ఎంపీపీ మునివేలు తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నేటి రాష్ట్ర ప్రభుత్వం 2022లో గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకురావడంతో ప్రభుత్వ సేవలు ప్రజల ముందుకు వచ్చాయన్నారు. నవరత్నాల ద్వారా సుమారు కోటి 50 లక్షల లబ్ధిదారుల కుటుంబాలకు నేరుగా వారి ఖాతాల్లోకి నగదు జమ అవుతోందని వివరించారు. ఇది పంచాయతీ రాజ్ వ్యవస్థ గొప్పతనంగా చెప్పవచ్చన్నారు. ఎంపీడీఓ బి.ఇందిర 'మండల స్థాయి ఉత్తమ పంచాయతీ పురస్కారం -2023' వివరాలను వెల్లడించారు. వివిధ విభాగాల్లో విశేష సేవలందించిన 14 పంచాయతీలకు ఉత్తమ పురస్కారాలకు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కె.మునస్వామిరెడ్డి, ఎంపీటీసీలు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

సర్పంచ్ గాలి మహేష్‌బాబుకి ఉత్తమ అవార్డు

పాలసముద్రం : మండలంలోని శ్రీకావేరిరాజుపురం పంచాయతీకి జిల్లాస్థాయిలో ఉత్తమ అవార్డు దక్కింది. ఈ అవార్డును సర్పంచ్ గాలి మహేష్‌బాబు సోమవారం జిల్లా కేంద్రంలోని చిత్తూరులో జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జెడ్పీ చెర్మన్ శ్రీనివాసులు చేతుల మీదుగా అందుకున్నారు. అవార్డు తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు.

మాకు అండగా నిలిచింది సీఎం జగనన్నే



మా నమ్మకం జగనన్నే అంటున్న వీధి వ్యాపారులు

నగరి: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. సోమవారం మున్సిపల్ పరిధిలోని సత్రవాడలో రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మున్సిపల్ పార్టీ కన్వీనర్ బీఆర్వీ అయ్యప్పన్ ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వేజగన్–జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని గృహసారథులు, పార్టీ శ్రేణులు నిర్వహించారు. అయితే వార్డు పర్యటనలో రోడ్డు కూడలి వద్ద బుట్టల్లో పువ్వులు అమ్ముకునే మహిళలు స్వచ్ఛందంగా వచ్చి మా భవిష్యత్, మా నమ్మకం సీఎం జగనన్నే ముక్తకంఠంతో నినదించారు. వీధి వ్యాపారులైన మాకు అమ్మఒడి, చేయూత, డ్వాక్రా రుణాలు, సొంత ఇల్లు ఇలా అన్నీ అందాయంటే జగనన్న చలవే అంటూ కొనియాడుతూ ముఖ్యమంత్రి చిత్రపటాన్ని చూపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జిల్లా నేత అనుబంధ సంఘ అధ్యక్షుడు కన్నాయిరం, అయ్యప్పన్, జగన్, అరుణాచలం, మణివాసగం తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా విద్యుత్ లాగితే కఠిన చర్యలు



డీఎస్పీ రవికుమార్



సీఐ రాజశేఖర్



అడవి పందులను వేటాడే పాత నేరస్తుడితో మాట్లాడుతున్న పోలీసులు

నగరి: రాత్రి వేళలో పంట పొలాల వద్ద అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ రవికుమార్ హెచ్చరికలు జారీచేశారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు పంట పొలాలపై అడవి పందులు దాడిచేయకుండా కంచెలకు రాత్రిపూట విద్యుత్ తీగలు అమర్చి విద్యుత్ సరఫరా చేయరాదన్నారు. ఈ కారణంగా సమీప రైతులు, రైతు కూలీలు మృత్యువాత పడేందుకు ఆస్కారం ఉందన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు ఎవరైనా పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

అనధికారిక విద్యుత్ తీగలపై చర్యలు

వెదురుకుప్పం: పంట పొలాల్లో అనధికారిక విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ లోకేష్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో పంట పొలాల వద్ద పంటలను రక్షించుకునే క్రమంలో కొందరు రైతులు రాత్రి సమయంలో విద్యుత్ తీగలు లాగుతున్నారని తెలిపారు. ఇది నేరమని హెచ్చరించారు.

నింద్రలో..

నింద్ర: గ్రామాల్లో రైతులు తమ పొలాల వద్ద పంటల రక్షణ కోసమని అనధికారికంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేసి అమాయకుల ప్రాణాలు తీయవద్దని నగరి రూరల్ సీఐ రాజశేఖర్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రైతులు తమ పొలాల వద్ద తీగలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేస్తే, ఆ విషయం తెలియక చాలామంది ఇతర రైతులు విద్యుత్ తీగలు తగిలి చనిపోతున్నారన్నారు. ఇలా చేయడం చట్టరీత్యా నేరమని ఆయన హెచ్చరించారు.

విద్యుత్ తీగలు వేయరాదు

పాలసముద్రం: మండలవ్యాప్తంగా గ్రామాల్లో రైతులు అడవి జంతువుల కోసం విద్యుత్ తీగలు వేయవద్దని ఎస్ఐ సురేష్ తెలిపారు. సోమవారం ఆయన గతంలో అడవి జంతులకు విద్యుత్ తీగలు వేసిన పందులను చంపి కేసుల్లో ఉన్నవారిని స్టేషన్‌కు పిలిపించి ఎస్ఐ మాట్లాడారు. ఎక్కడైనా అడవి జంతువులకు విద్యుత్ తీగలు వేస్తున్నట్లు తెలిస్తే 9440900687కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న పాలనకు ప్రజలు బ్రహ్మరథం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ

కార్వేటినగరం: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమానికి గ్రామాల్లో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మండల కన్వీనర్ శేఖర్‌రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల వద్దకు ప్రభుత్వ అధికారులు అన్న నినాదంతో పాలన అందిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఎక్కడికి వెళ్లిన ప్రతి నోట జగనన్న మాటే వినిపిస్తున్నాయని గుర్తు చేశారు. రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాల్లో ప్రతి ఇంటికీ రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు లబ్ధి పొందుతూ సంతోషంగా ఉంటున్నారన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో అధికార ప్రభుత్వానికి 175 సీట్లకు గానూ 175 స్థానాల్లో పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని గుర్తు చేశారు. అదేవిధంగా జీడీనెల్లూరు నియోజకవర్గాన్ని జిల్లాలో ఎక్కడా లేని విధంగా పులివెందుల తరహాలో అభివృద్ధికి కృషి చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామిని కూడా వచ్చే ఎన్నికల్లో అత్యంత మెజారిటీతో గెలిపించి జగనన్నకు కానుకగా అందించడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ లత, మాజీ మండల కన్వీనర్ ధనుంజయవర్మ, ధనరాజ్, పురంధర్, పట్నం ప్రభాకర్‌రెడ్డి, వెంకటేష్, శ్రీనివాసులు, పయణిరెడ్డి, దాముదెడ్డి, ధనశేఖర్‌వర్మ పాల్గొన్నారు.